# మనం

కృష్ణా / గుంటూరు

ఎన్టీఆర్ - బాపట్ల - పల్నాడు

మంగళవారం | 29 | జూలై | 2025 | పేజీలు:4




## దుర్గమ్మను దర్శించుకున్న విజయవాడ రైల్వే డిఆర్ఎం

విజయవాడ పశ్చిమ, జూలై 28 (మనం న్యూస్): విజయవాడ నూతన రైల్వే డిఆర్ఎం మోహిత్ సొంకియా వారు నూతన రైల్వే డిఆర్ఎం హోదాలో బాధ్యతలు చేపట్టిన సందర్భంగా అమ్మవారి దర్శనానికి విచ్చేయగా ఆలయ కార్యనిర్వాహణాధికారి వారు స్వాగతం పలికి అమ్మవారి దర్శనము, ప్రసాదము, వేద ఆశీర్వచనము అందించి అమ్మవారి చిత్రపటం అందజేసినారు.



2 లో

## పాస్‌పోర్టు దరఖాస్తుల విచారణ సేవల్లో రాష్ట్రంలో తృతీయ స్థానంలో నిలిచిన కృష్ణా జిల్లా పోలీసులు

అభినందించిన డీజీపీ

ప్రసంశం పత్రం అందుకున్న ఎస్పీ, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌ఛార్జీ ఇన్స్పెక్టర్



4 లో

-నందిగామ టౌన్, మనం న్యూస్

### నందిగామతో నాకున్న అనుబంధం

# మాటలలో చెప్పలేనిది

## రాష్ట్ర ఆర్థిక శాఖమంత్రి పయ్యావుల కేశవ్



4 లో

-విజయవాడ సెంట్రల్, మనం న్యూస్

రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే ఉపేక్షించేది లేదు

నాణ్యమైన విత్తనాలను రైతులకు అందించాలి

రైతులకు అన్యాయం జరిగితే చర్యలు తప్పవు

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ.

## కృత్రిమ ఎరువుల కొరత సృష్టిస్తే ఖబడ్దార్

## చోరీకి గురైన గంటల వ్యవధిలో నేరస్తులు గుర్తింపు



**విజయవాడ తూర్పు , జూలై 28 (మనం న్యూస్):** ఎన్టీఆర్ పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు వచ్చిన తర్వాత ఆధునిక ₹సాంకేతిక పరిజ్ఞానం వినియోగం నగరంలో అన్ని ప్రాంతాల్లో సిసి కెమెరాలతో నేరస్తులను పట్టుకోవడంలో క్రైమ్ అదనపు ఏడిసిపి రాజారావు ప్రత్యేక చొరవ చూపారు. రాత్రిపూట ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో పూజ గదిలోకి ప్రవేశించిన దొంగలు తమ ఇంట్లో చోరీకి పాల్పడినట్లు బాదితులు సిసిఎస్ పోలీసులను ఆశ్రయించారు. బాధితులకు సంభందించిన 365 గ్రాములు బంగారం 30 వేల నగదు చోరీకి గురయినట్లు వారు పేర్కొన్నారు. విజయవాడ పడమట ఫన్ టైమ్ క్లబ్ రోడ్డు 9వ వీధిలో చోరీకి గురైన నివాస ప్రాంతాన్ని క్లూస్ టీంతో కలిసి విజయవాడ సిసిఎస్ పోలీస్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. సుమనా గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు శంకర్ వరప్రసాద్ పడమట ఫన్ టైమ్ క్లబ్ వీధి 9వ రోడ్డు ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. ఆదివారం రాత్రి తమ ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో చోరీ జరిగిందని తెల్లవారు జామున లేచి చూసేసరికి సంఘటన గుర్తించి సోమవారం నాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన ప్రాంతానికి వెళ్ళిన సిసిఎస్ పోలీస్ అధికారులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో గంటల వ్యవదిలోనే నేరస్తులను పోలీసులు గుర్తించారు.



## ప్రజారోగ్యం పై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- **ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్**



**విజయవాడ పశ్చిమ, జూలై 28 (మనం న్యూస్):** ప్రజారోగ్యమే లక్ష్యంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ అన్నారు. ఎమ్మెల్యే సుజనా చౌదరి సౌజన్యంతో మంజూరైన ఎల్ ఓ సీ ను (లెటర్ ఆఫ్ క్రెడిట్) పత్రాన్ని సోమవారం ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ కూటమి నేతలతో కలిసి అందజేశారు.. 43 వ డివిజన్ ఊర్మిళ నగర్ కు చెందిన పంగా వీరాంజనేయులు రోడ్డు ప్రమాదంలో గాయపడి ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.. అతనికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులు తెలపడంతో ఎన్డీఏ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోగా బాధితుని భార్య వరమ్మ కు రూ 5 లక్షల 21 వేల ఎల్ ఓ సీ ను అందజేశారు.. ఈ సందర్భంగా అడ్డూరి శ్రీరామ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే సుజనా చౌదరి ప్రజల ఆరోగ్య సమస్యలను రూపుమాపేందుకు త్వరలోనే సంచార వైద్యశాలలను ప్రారంభించడానికి సిద్ధమయ్యారని అన్నారు.. ప్రజారోగ్యమే లక్ష్యంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు.

## ఫోక్సో చట్టం పై అవగాహన



**పామర్రు, జూలై 28 (మనం న్యూస్):** చిన్నపిల్లలు మహిళలపై నేటి సమాజంలో జరుగుతున్న లైంగిక దాడులు, వాటిని నివారించడానికి తీసుకోవలసిన చర్యలు, మహిళలకు రక్షణగా ఉన్నటువంటి శక్తి యాప్ ఫోక్సు చట్టాలు, 112 కాల్స్ మరియూ సైబర్ నేరాలు మొదలైన వాటి గురించి విద్యార్థులలో మరియు ఆడవారిలో గ్రామ/ వార్డు స్తాయిలో అవేర్నెస్ తీసుకురావడానికి ఎలాంటి కార్యక్రమాలు చేయాలనే విషయం మీద ఈరోజు కూచిపూడి పోలీస్స్టేషన్లో మహిళా పోలీసులకు శ్రీ వి సుభకర్ పామర్రు సీఐ ప్రత్యేక సెమినార్ నిర్వహించారు ఈ కార్యక్రమంలో కూచిపూడి ఎస్ఐ విశ్వనాద్ సిబ్బంది పాల్గొన్నారు.

## కారు పార్కింగ్ కోసం సచివాలయ కార్యాలయం



**ఉయ్యూరు జులై 28 (మనం న్యూస్):** ఉయ్యూరు నగరపంచాయతీ కార్యాలయ ఆవరణలో ఉన్న 1వ సచివాలయాన్ని మాజీ కమిషనర్ తన కారు పార్కింగ్కు ఉపయోగించుకోవడంతో సచివాలయానికి పనుల ని మిత్తం వచ్చేవారు వేచి ఉండేందుకు ఖాళీలేక అసౌకర్యానికి గురవుతున్నారు. నగరపంచాయతీ ఆవరణలో ఉన్న షెడ్డులో ఒకటి, రెండు వార్డుల సచివాలయం కొనసాగు తోంది. దీంతోపాటు వైద్య, ఆరోగ్య శాఖకు చెందిన సిబ్బందికూడా ఇక్కడే విధులు నిర్వ హిస్తూ వ్యాక్సిన్ వంటి కార్యక్రమాలు చేస్తుంటారు. ఈనేపథ్యంలో జూన్లో రిటైర్ అయిన కమిషనర్ తన సొంతకారుకు సచివాలయాన్ని కారు పార్కింగ్కు ఉపయోగిం చుకుంటూ ఇబ్బంది కలిగించడం పట్ల స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. రిటైర్ అయినా కూడా ఇక్కడే కారు ఉంచి పార్కింగ్కు ఉపయోగించుకోవడంతో సిబ్బందితో పాటు పనుల నిమిత్తం వచ్చేవారు ఇబ్బంది పడుతున్నారు. కమిషనర్ కారుతో పాటు ఒక ఉద్యోగి కారు కూడా ఇక్కడే పార్కింగ్ చేస్తూ సచివాలయ ఆవరణలో ఖాళీలేకుం డా చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సచివాలయాన్ని అన్య వాహనాల పార్కింగ్ నుంచి కాపాడవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నారు.

## పాస్పోర్టు దరఖాస్తుల విచారణ సేవల్లో రాష్ట్రంలో తృతీయ స్థానంలో నిలచిన కృష్ణా జిల్లా పోలీసులు



**మచిలీపట్నం, జూలై 28 (మనం న్యూస్):** జూలై 2024 నుండి జూన్ 2025 మధ్యకాలంలో 30వేల వరకు పాస్పోర్ట్ దరఖాస్తులను విచారణ పూర్తి చేసి, అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్టం లో తృతీయ స్థానాన్ని సాధించిన కృష్ణాజిల్లా పోలీస్ లను రాష్ట డిజిపి హరీష్ కుమార్ గుప్తా అభినందించారు. సోమవారం నాడు ఈ ప్రశంస పత్రాన్ని జిల్లా ఎస్పీ ఆర్. గంగాధరరావు, ఐపీఎస్., స్పెషల్ బ్రాంచ్ ఇంచార్జ్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర రావు కి అందజేసి, అభినందనలు తెలియజేశారు. ప్రస్తుతం తృతీయ స్థానం సాధించామని, మరింత అత్యుత్తమ ప్రతిభ కనపరుస్తూ మొదటి స్థానంలో నిలవడానికి కృషి చేయాలని ఆయన కోరారు.

## రామాలయానికి విరాళాలు అందేజేత



**ఉయ్యూరు జులై 28 (మనం న్యూస్):**పమిడిముక్కల మండలంలోని తాడంకి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవాలయ నిర్మాణానికి దాతలు ముందుకు వచ్చారు. కీర్తిశేషులు జంపాన నాంచారయ్య గారి జ్ఞాపకార్థం సర్పంచ్ జంపాన ధనలక్ష్మి కుమారులు శ్రీనివాసరావు, రఘుబాబులు ర్హూ1,11, 116 రూపాయలు, వారి కుటుంబ సభ్యులు, బంధువులు స్నేహితులు, రూ 1లక్ష, -కీర్తిశేషులు మారగాని సీతారామయ్య వెంకటేశ్వరమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు సుబ్బారావు, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు రూ 1, 11,116, -కీర్తిశేషులు పులి నరసింహారావు ,శ్యామలమ్మల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు పులి గంగాధరరావు,ఆదిలక్ష్మి, సాయి, అంజి, రూ 1,11,1 16 రూపాయలు, -కీర్తిశేషులు పరిసే పోతురాజు, నాగేశ్వరమ్మ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు పరిసే శ్రీనివాసరావు మంగమ్మ, మహేశ్వరీలు రూ 1,11, 116 రూపాయలు, -మారగాని నాగేశ్వరరావు, సీతారామ, సత్య వరప్రసాద్, మహేష్, కుటుంబ సభ్యులు రూ 1, 11,116 రూపాయలు భూరి విరాళాలు అందజేశారు. ఈ మొత్తం విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు మాజీ ఎమ్మెల్సీ, పంచాయతీరాజ్ ఛాంబర్ జాతీయ అధ్యక్షులు వైవిబి రాజేంద్రప్రసాద్ చేతుల మీదగా సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ గ్రామంలో రామాలయ నిర్మాణం చేపట్టడం అభినందనీయమన్నారు. గ్రామస్తులు, దాతలందరి సహకారంతో శ్రీ సీతారామచంద్ర స్వాముల వారి దేవాలయ నిర్మాణం స్ఫూర్తిదాయకం అన్నారు. భగవత్ కార్యక్రమం చాలా గొప్పది అన్నారు. ఆలయ నిర్మాణానికి రైతులు భూరి విరాళాలు అందించడం అభినందనీయం అన్నారు. విరాళాలు అందించిన దాతలు.. అందిస్తున్న దాతలకు సీతారామచంద్ర స్వామి వారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయన్నారు. స్వచ్ఛందంగా ఆలయ నిర్మాణంలో భాగస్వాములై రాములోరి కృపాకటాక్షాలు పొందాలని ఆకాంక్షించారు. ముందుగా సర్పంచ్ జంపాన ధనలక్ష్మి నివాసానికి వెళ్లారు. కాలుకు గాయమై చికిత్స పొందుతున్న ఆమె మనవడు వార్షిక్ శ్రీనాధుని పరామర్శించి యోగక్షేమాలు తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీల నిధులు, విధులు, గ్రామ సచివాలయాల పనితీరు, 15 ఆర్థిక సంఘం నిధులు, ప్రభుత్వ పాలన విధానాలపై చర్చించారు. కార్యక్రమంలో టిడిపి మైనారిటీ విభాగం రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ అజ్మతుల్లా(బాబు), టీడీపీ బి.సి.విభాగం రాష్ట్ర కార్యదర్శి రాజులపాటి ఫణి, ఉయ్యూరు జడ్పీ హైస్కూల్ కమిటీ చైర్మన్ ఆరేపల్లి శివసాయి,తాడంకి శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయం ప్రతినిధులు,స్థానికులు మారగని సుబ్బారావు, జంపాన రాఘవయ్య, మారగాని ప్రసాద్,ఈడే చిన్నోడు,వీరంకి శ్రీనివాసరావు, మరగాని మహేష్,ఈడే శివయ్య తదితరులు పాల్గొన్నారు.

## పైడూరుపాడులో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ భవన నిర్మాణానికి శంకుస్థాపన



**విజయవాడ రూరల్, జులై 28, మనం న్యూస్:** విజయవాడ రూరల్ మండలం పైడూరుపాడులో స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ భవన నిర్మాణానికి మైలవరం శాసనసభ్యులు వసంత కృష్ణ ప్రసాదు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శాస్త్రోక్తంగా భూమిపూజ చేశారు. దీని నిర్మాణానికి డి.ఎం.ఎఫ్ నిధుల నుంచి రూ.25 లక్షలు మంజూరయ్యాయి.ముందుగా గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.42.80 లక్షల వ్యయంతో నిర్మించిన సిమెంట్ రహదారులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాదు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మైలవరం నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు వెల్లడించారు. ప్రజల సామాజిక అవసరాలు, బహిరంగ ప్రయోజనాల కోసం ఇక్కడ స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో స్థానిక ఎన్డీఏ కూటమి కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## నాగసత్యమ్మ అమ్మవారికి తామరపూలతో ప్రత్యేక అలంకారం



**జగ్గయ్యపేట జులై 28 మనం న్యూస్ :** జగ్గయ్యపేట పట్టణ సమీపంలోని స్టీల్ ప్లాంట్ క్వార్టర్స్ వద్దగల శ్రీ నాగ సత్యమ్మ అమ్మవారికి తామర పూలతో ప్రత్యేక అలంకారం నిర్వహించారు. అమ్మవారిని శ్రవణ మాస పూజలలో భాగంగా సోమవారంతామర పూలతో అలంకరించి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజిం చారు.

## వైభవంగా గోదా అమ్మవారి పుట్టినరోజు వేడుకలు



**జగ్గయ్యపేట, జులై 28 మనం న్యూస్ :** పట్టణంలోని పలు ఆలయాలలో ఆండాళ్ తిరునక్షత్రం (గోదా అమ్మవారి పుట్టినరోజు) వేడుకలను వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని ఆ రంగనాయక స్వామి, చెన్నకేశవ స్వామి, విజయవాడ రోడ్డులోని వేణుగోపాలస్వామి తదితర ఆలయాలలో ఆండాళ్ తిరునక్షత్రం పురస్కరించుకొని ఉదయం అమ్మవారికి పంచామృత అభిషేకాలు ప్రత్యేక అలంకారాలను పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి స్తోత్ర మాలను పఠించారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాలలో అమ్మ వార్లను పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని ఆలయాలలో ప్రత్యేక పూజలను నిర్వహించారు.

# ఘనంగా జరిగిన పదవీ విరమణ మహోత్సవ కార్యక్రమం



**మచిలీపట్నం, జూలై 28, (మనం న్యూస్):** కృష్ణ జిల్లా ఎంఈఎఫ్ టీమ్ అధ్యక్షతన పదవీ విరమణ మహోత్సవ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించడం జరిగింది. ఉద్యోగ గురుతర బాధ్యతలు నిర్వహించి మంచి వ్యక్తిగా ప్రజలలో పేరుపొందిన పెనుముత్స మధు సుధనరావు (జడ్పీ మధు) ను ప్రముఖ వైద్య నిపుణులు ప్రభుత్వ మెడికల్ కాలేజ్ హాస్పిటల్ డిప్యూటీ సూపరింటెండెంట్ డా . భాను మూర్తి శాలువాతో సత్కరించి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగంలో వడిదొడకులను ఎదుర్కొంటూ, ప్రజలకు సత్వర న్యాయం అందించడంలో ప్రభుత్వ ఉద్యోగి యొక్క పాత్ర ఎనలేనిదని వక్తలు కొనియాడారు. పదవి విరమణ మహోత్సవంలో ముఖ్య అతిథులుగా పాల్గొన ఎం ఈ ఎఫ్ కృష్ణ జిల్లా అధ్యక్షులు రావెళ్ల వరుణ్ కుమార్, సీనియర్ నాయకులు కొడమంచిలి చెంద్రశేఖర్ కోకిల్లిగడ్డ శ్రీను, చక్రవర్తి ను ప్రేమపూర్వకంగా, కృష్ణాజిల్లా ఎం ఈ ఎఫ్ విభాగం తరపున సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమం లో సన్మాన గ్రహీతలు చేసిన సేవలను కృషిని పలువురు వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎం ఈ ఎఫ్ విభాగ జిల్లా అధ్యక్షులు దేవరపల్లి విక్టర్ బాబు, జిల్లా ఉపాధ్యక్షులు జుజ్జువరపు అనిల్ కుమార్, కారుమూడి వెంకయ్య, ఎం ఈ ఎఫ్ లీగల్ అడ్వైజర్ అద్దేపల్లి నిరంజన రావు పాల్గొన్నారు.

# గ్రూప్ ఆఫ్ వాసవి క్లబ్స్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు



**మచిలీపట్నం. జులై 28 (మనం న్యూస్):** వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఇరుకుల రామకృష్ణ ఆదేశానుసారము మూడు క్లబ్బుల ఆధ్వర్యంలో గవర్నర్ విజిట్ అనే కార్యక్రమము ఘనంగా నిర్వహించడం జరిగింది. గాంధీ బొమ్మ శివాలయంలో గవర్నర్ సాయి సునీత ప్రత్యేక పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. అనంతరం వేద పండితులు వేదఆశీర్వచనం నిర్వహించి, స్వామివారి తీర్ధ ప్రసాదాలు,ప్రతిమను అందించారు. సేవా కార్యక్రమంలో భాగంగాశ్రీపాద ఫంక్షన్ హాల్ లో చిరు వ్యాపారాలు చేసుకునే వర్తకులకు గొడుగులు, చీరలు, దుప్పట్లు అందించారు. ఆర్యవైశ్య పేద విద్యార్థినికి చదువు నిమిత్తం 7058 రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. గుడికి వచ్చిన భక్తులకు జల ప్రసాదం లో భాగంగా ముత్యం గుడిలో వెయ్యి లీటర్ల వాటర్ ట్యాంకు, వర్రె గూడెం రామాలయంలో వాటర్ ట్యాంకు లు సంస్థ తరపున విరాళంగా అందించారు. లేడియంప్తిల్ కాలేజీలో పేద విద్యార్థులకు 100 మందికి కాలేజీ యూనిఫారం అందజేశారు.ఈ కార్యక్రమానికి గవర్నర్ అన్నం సాయి సునీత, వైస్ గవర్నర్ మాజేటి హరిప్రసాద్, క్యాబినెట్ ట్రెజరర్ సముద్రాల సూర్య ప్రకాశ రావు, చిట్టూరి శ్రీనివాసరావు పిఆర్వో ఐపీసీ యండూరీ సురేష్, ఐపీసీ శ్రీకాకుళపు రేణుక రాణి తదితర క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# ఎంబెడెడ్ ఐ.ఓ.టి,ఇండస్ట్రియల్ ఆటోమేషన్ పై వారం రోజుల వర్క్ షాప్




**మైలవరం జులై 28 మనం న్యూస్:** స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ఈ.ఈ.ఈ మరియు ఎంబెడెడ్ తారాస్ సిస్టమ్స్ అండ్ సొల్యూషన్స్ వారి ఆధ్వర్యంలో తృతీయ సంవత్సరం విద్యార్థిని , విద్యార్థులకు ఎంబెడెడ్ ఐ.ఓ.టి మరియు ఇండస్ట్రియల్ ఆటోమేషన్ అనే అంశం పై వారం రోజుల పాటు నిర్వహించుచున్నారు. ఈ కార్యక్రమానికి ఎస్.మాధవ్ పాండియన్, డైరెక్టర్, ఎంబెడెడ్ తారాస్ సిస్టమ్స్ అండ్ సొల్యూషన్స్ , బెంగళూర్ వారు రిసోర్స్ పర్సన్ గా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ ఎంబెడెడ్ ఐ.ఓ.టిలో నైపుణ్యం కలిగిన ఎలక్ట్రికల్ ఇంజినీర్లు ఉత్తేజపరమైన కెరియర్ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ ఈ.ఈ విభాగాధిపతి పి .శోభారాణి మాట్లాడుతూ ప్రభుత్వ మరియు ప్రైవేట్ రంగ పరిశ్రమల్లో ఎలక్ట్రిక్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీర్లు కు మంచి డిమాండ్ ఉందని మరియు రియల్ వరల్ అప్లికేషన్స్ కి ఇలాంటి వర్క్ షాప్ నిర్వహించడం అవసరమని తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ బి.రమేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఎలక్ట్రికల్ ఉత్పత్తులకు ఎక్కువ డిమాండ్ ఉందని దీనికి నైపుణ్యం ఉన్న ఇంజినీర్లు అవసరమని మరియు విద్యార్థిని, విద్యార్థులు ఈ వారం రోజుల వర్క్ షాప్ ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి వై.రఘువంశీ, కె.లక్ష్మి లావణ్య కో ఆర్డినేటర్లు గా వ్యవహరించారు. ట్రైనింగ్ ప్రోగ్రాంలో సుమారు 70మంది విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం



**హనుమాన్ జంక్షన్, జూలై 28 ( మనం న్యూస్) :** రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. బాపులపాడు మండలం కోడూరుపాడు గ్రామంలో సోమవారం సాయంత్రం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న యార్లగడ్డ గత ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సంక్షేమ పథకాల అమలు తీరును లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలను ఆప్యాయంగా పలుకరిస్తూ వారి సమస్యలు తెలుసుకుని వారి నుండి అర్జీలు స్వీకరించిన ఆయన సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రావు మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం తమ ప్రభుత్వం ఇతోదికంగా నిధులు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి 24 గంటల్లో రైతులు ఖాతాలో డబ్బు జమ చేసిన సంగతి గుర్తు చేశారు. బుడమేరు వరదల కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు యుద్ధ ప్రాతిపదికన నష్టపరిహారం విడుదల చేసి రైతులను ఆదుకున్నామన్నారు. ఏడాది ముందుగానే సాగునీటిని విడుదల చేసినట్లు చెప్పారు. రైతులకు ఇచ్చే వ్యవసాయ రుణాలను పెంచినట్లు చెప్పారు. గన్నవరం నియోజకవర్గంలో రసాయన ఎరువుల కొరత నివారణకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ప్రజలందరూ మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. రాబోయే రెండేళ్లలో గన్నవరం నియోజకవర్గ ముఖచిత్రం మారనుందని అన్నారు. గన్నవరం నియోజకవర్గాన్ని అభివృద్ధిలో రాష్ట్రంలోని మొదటి స్థానంలో నిలుపుతానని ప్రజలందరూ తనకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట కార్యవర్గ నిర్వాహక కార్యదర్శి చిరుమామిళ్ల సూర్యం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు దయాల రాజేశ్వరరావు ప్రధాన కార్యదర్శి పుట్టా సురేష్ రాష్ట్ర తెలుగు రైతు నాయకులు గుండపనేని ఉమా వరప్రసాద్, డి సి చైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్ , వేములపల్లి శ్రీనివాసరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు కొండపల్లి వెంకన్న మాజీ సర్పంచ్ ఆర్నెపల్లి సూరిబాబు, గ్రామ సర్పంచ్ ఆర్నెపల్లి , జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి గండిపూడి నితీష్ కుమార్, చలసాని శ్రీనివాసరావు, మొవ్వ వెంకటేశ్వరరావు, బొమ్ములూరు ,దంటగుంట్ల సర్పంచులు కాటూరి విజయభాస్కర్, యజ్జవరపు రంగారావు, చిన్నాల చిన్నా, సింగవరపు చంద్రమౌళి, ప్రసాద్ పాల్ కర్ర, మొవ్వా వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# కొమరగిరి జయప్రదకు నివాళులు అర్పించిన పుర ప్రముఖులు



**మచిలీపట్నం, జూలై 28 (మనం న్యూస్):** శ్రీ బాలాజీ విద్యాలయం వ్యవస్థాపకురాలు, శ్రీవాణి మాసపత్రిక సంపాదకురాలు కొమరగిరి జయప్రద మరణంపై కృష్ణాజిల్లా మానవతా స్వచ్ఛంద సంస్థ అడ్వైజర్ ప్రముఖ సీనియర్ న్యాయవాది, లంకిశెట్టి బాలాజీ, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గొర్రెపాటి గోపీచంద్, బ్రాహ్మణ సంఘం నాయకుడు, పి. వి. ఫణి కుమార్ మాదిరెడ్డి మెహర్ బాబా లు విచారం వ్యక్తం చేశారు. వారి పార్థివ దేహానికి సోమవారం నివాళి అర్పించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. నగరానికి చెందిన పలు రాజకీయ పార్టీ నాయకులు, సత్యసాయి బాబా సేవకులు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కరస్పాండెంట్లు, జయప్రద మృతదేహానికి నివాళులు అర్పించారు.

# తాడికొండ చిన్నా ఆధ్వర్యంలో 1వ బూత్‌లో ఇంటింటికీ ప్రచారం



**ఘంటసాల జూలై 27 (మనం న్యూస్):** పేదల అభ్యున్నతి, రాష్ట్ర సమగ్ర అభివృద్ధికై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కృషి చేస్తున్నారని రాష్ట్ర తెలుగు యువత నాయకులు, ఎంపీటీసీ తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా) అన్నారు. కృష్ణాజిల్లా ఘంటసాల మండల పరిధిలోని శ్రీకాకుళం గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా 1వ బూత్ లో కూటమి నాయకులు ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం చేస్తున్న మరియు రాబోయే రోజుల్లో చేయబోయే సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఘంటసాల మార్కెట్ యార్డ్ డైరెక్టర్ నాగిని, తాడేపల్లి ఉప సర్పంచ్ కొడాలి లక్ష్మణ్, బూత్ కన్వీనర్ అరేపల్లి డాంగే కుమార్, సొంసెట్టి నాగులు, వేణు తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ జర్నలిస్ట్ సీతారామయ్యకు ఏపీయూడబ్ల్యూజే నేతల పరామర్శ



**మోపిదేవి, జూలై 27(మనం న్యూస్):** సీనియర్ జర్నలిస్ట్, మోపిదేవి ఆంధ్రజ్యోతి రిపోర్టర్, ఏపీయూడబ్ల్యూజే నాయకులు కందుల సీతారామయ్యను ఏపీయూడబ్ల్యూజే నాయకులు సోమవారం పరామర్శించారు. ఇటీవల అస్వస్థతకు గురై ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న సీతారామయ్యను వెంకటాపురంలోని ఆయన స్వగృహంలో కలిసిన నాయకులు ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా కన్వీనర్ చలమలశెట్టి రమేష్ బాబు, రాష్ట కమిటీ సభ్యులు పుట్టి శ్రీనివాసరావు, యూనియన్ జిల్లా నాయకులు నడకుదురు లీలా బ్రహ్మేంద్రచారి, అడపా సాయిబాబు, పైడిపాముల అశోక్ కుమార్, ఆకుల సుధీర్ కుమార్, షేక్ ఎజాజ్ అహ్మద్, ఎస్. లక్ష్మణబాబు, యూనియన్ సభ్యులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

# మద్విరాట్ విశ్వకర్మ భగవాన్ యజ్ఞ మహోత్సవం పోస్టర్ ఆవిష్కరణ



**ఇబ్రహీంపట్నం, జూలై 28 (మనం న్యూస్):** కొండపల్లిలో పట్టణంలోని గిరి వీరేశ్వర విశ్వేశ్వరస్వామివారి ఆలయంలో వేంచేసియున్న మద్విరాట్ విశ్వకర్మ భగవాన్, కామాక్షి అమ్మవార్ల సన్నిధియందు మద్విరాట్ విశ్వకర్మ భగవాన్ యజ్ఞ మహోత్సవం పోస్టర్ ను సోమవారం నాడు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య ఆవిష్కరించారు. ముందుగా జంపాల సీతారామయ్య ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలోనే మొట్టమొదటి సారిగా మద్విరాట్ విశ్వకర్మ భగవాన్ స్వామి వారి దీక్షాధారణ ప్రత్యేకత అని తెలిపారు. ఈ సంవత్సరం ద్వితీయ మాల ధారణ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు రామినేని రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ పార్టీ అంటే బీసీ ల పార్టీ, నాగ వంశీయులకు కళ్యాణ మండపం నిర్మిస్తున్నాం

- ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు



**విజయవాడ సెంట్రల్, జూలై 28 (మనం న్యూస్):** అన్ని సామాజిక వర్గాల వారికి కళ్యాణ మండపాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు స్పష్టం చేశారు. ఎన్ని నిధులు ఖర్చు అయినా వెనకాడేది లేదని, నియోజకవర్గం లో రాబోయే రోజుల్లో మిగిలి ఉన్న అన్ని పనులు పూర్తి చేస్తామని ఆయన పేర్కొన్నారు. సోమవారం నాడు సెంట్రల్ నియోజకవర్గంలోని 57వ డివిజన్ న్యూ రాజరాజేశ్వరి పేట పోలీస్ స్టేషన్ రోడ్డులోగల సబ్ స్టేషన్ ఎదురుగా రు.70 లక్షల వ్యయంతో నిర్మించనున్న బీసీ కళ్యాణ మండపం పనులకు ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు కొబ్బరికాయ కొట్టి, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఎన్డిఎ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నిలబెట్టుకుంటూ ముందుకు సాగుతుందన్నారు. అందులో భాగంగా పింఛన్లు పెంచి, వృద్ధులకు వికలాంగులకు అండగా ఉంటున్నామని, మహిళలకు ఏడాదికి 3గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నామని అన్నారు. ప్రతి బిడ్డకు తల్లికి వందనం ఇంట్లో ఎంతమందికి ఉంటే అంతమందికి 13వేల రూపాయల చొప్పున అందజేశామని, రాష్ట్రంలోని మహిళలకు ఆగస్టు 15 నుండి ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తామన్నారు. శ్రీనిధి నిరుద్యోగ భృతి త్వరలోనే అమలు చేయనున్నామన్నారు. ఏడాది సమయంలో తాము చేసిన పరిపాలన గురించి సుపరిపాలన కు తొలి అడుగు కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకు వెళ్లి నేరుగా తెలుసుకుంటూ సమస్యల పరిష్కార దిశగా ముందుకు వెళ్తున్నామని అన్నారు.


# మానవసేవయే మాధవ సేవ

- స్నాప్లిక హెల్పింగ్ హాండ్స్, ఫోటో గ్రఫీ సిఇఒ షేక్ సుబాని




**విజయవాడ సెంట్రల్, జూలై 28 (మనం న్యూస్):** స్నాప్లిక హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో స్నాప్లిక హెల్పింగ్ హాండ్స్ టీం సభ్యులు సోమవారం నాడు విజయవాడ రైల్వే స్టేషన్, బస్టాండ్ పరిసర ప్రాంతాలలో పర్యటించి అనాధలు, మతి స్థిమితం లేని వారిని, రోడ్డు పైన భిక్షాటన చేస్తున్న వారిని గుర్తించి వారికి క్షవరం చేయించి, స్నానం చేయించి వారిని శుభ్ర పరిచారు. వారందరికీ అనగా సుమారు 80 మందికి నూతన వస్త్రములను పంపిణీ చేసి, సుమారు 300 మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు వచ్చేసిన ప్రముఖ న్యాయవాది వల్లభనేని నాగ పవన్ కుమార్, సిఇఒ షేక్ సేబాని., గుడివాడ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ, న్యాయవాది మన్నం రాజశేఖర్ పాల్గొని స్నాప్లిక హెల్పింగ్ హాండ్స్ టీం సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా ప్రముఖ న్యాయవాది వల్లభనేని నాగ పవన్ కుమార్ మాట్లాడుతూ సమాజంలో రోడ్ల పైన కనిపిస్తున్న దిక్కులేని వారికి సమాజ సేవ చేయటం ఎంతో మంచి కార్యక్రమం అన్నారు. మానవసేవయే మాధవ సేవ అని వారు పేర్కొన్నారు. మన కంటికి కనిపిస్తున్న మానవులకు మనం సేవ చేయలేనిదే, మాధవడైన దేవుడికి ఎలా సేవ చేస్తామంటూ ఆయన ప్రశ్నించారు. కనిపిస్తున్న మానవుడికి సేవ చేయడమే మాధవుడికి సేవ చేయడమని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్నాప్లిక హెల్పింగ్ హాండ్స్, ఫోటో గ్రఫీ సిఇఒ షేక్ సుబాని, వారి టీం సభ్యులు పాల్గొని విజయవాడ రైల్వే స్టేషన్, బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో రోడ్ల పైన భిక్షాటన చేస్తున్న పలువురికి వారు క్షవరం చేయించి శుభ్రంగా తలస్నానం చేయించి వారిని శుభ్రపరిచారు. వారందరికీ అనగా సుమారు 80 మందికి నూతన వస్త్రములను పంపిణీ చేశారు. సుమారు 300 మందికి భోజనాలు ఏర్పాటు చేశారు.

# సమర్ధవంతంగా తాగునీటి సరఫరా నిర్వహణ



**విజయవాడ తూర్పు, జూలై 28 (మనం న్యూస్):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం మన్ కీ బాత్ కార్యక్రమంలో విజయవాడ నగరాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించడం, ముఖ్యంగా స్వచ్ఛ్ భారత్ మిషన్ ద్వారా విజయవాడలో తాగునీటి నీటి సరఫరా నిర్వహణలో తీసుకుంటున్న ప్రయోగాత్మక చర్యలను గుర్తించి ప్రశంసించటం మనందరికీ గర్వకారణం అని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడకు చెందిన పౌరుడిగా, అలాగే విజయవాడ పార్లమెంట్ సభ్యుడిగా విజయవాడ నగరానికి ఇచ్చిన గుర్తింపునకు ప్రధాని నరేంద్ర మోదీకి ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) కృతజ్ఞతలు తెలిపారు. శాశ్వత అభివృద్ధి కార్యక్రమాలే లక్ష్యంగా పనిచేస్తున్న కేంద్ర, రాష్ట్రాల్లోని ఎన్డీఏ ప్రభుత్వాల నిబద్ధతకు ఇది అద్దం పడుతుందని ఎంపీ కేశినేని శివనాథ్ స్పష్టం చేశారు. విజయవాడ నగరంలో మంచినీటి సరఫరా నిర్వహణ సాక్షాత్తు దేశ ప్రధాని మోదీ మనస్సు గెలుచుకోవడం గర్వకరణంగా ఉందని,16 లక్షల మంది జనాభా కలిగిన నగరానికి మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు సురక్షితమైన మంచినీటిని అందిస్తున్నారని, నీరు వృథా కాకుండా సమర్ధవంతమైన స్కాడా వంటి అత్యాధునిక సాంకేతిక విధానాన్ని కూడా కార్పొరేషన్ అనుసరిస్తుందని ఎంపీ స్పష్టం చేశారు. వాటర్ ఆడిటింగ్ జరపుతూ ముఖ్య నిర్ణయాలను తీసుకుంటున్నారని, నాణ్యమైన నీటి కోసం అధునాతన ల్యాబ్ ద్వారా పరీక్షలు నిర్వహిస్తూ స్వచ్ఛమైన నీటిని నగరవాసులతో పాటు 30 శాతం నివాసం ఉంటున్న కొండ ప్రాంతాల ప్రజలకు ఇబ్బంది లేకుండా అందిస్తున్నామని ఎంపీ కేశినేని శివనాథ్ వెల్లడించారు. విజయవాడ నగరవాసుల అవసరాల మేరకు సమర్ధవంతంగా తాగునీటి సరఫరా చేస్తున్న వి.ఎం.సి కమిషనర్ ధ్యానచంద్ర తోపాటు నీటి సరఫరా విభాగం అధికారులు సిబ్బందికి ఎంపీ కేశినేని శివనాథ్ అభినందనలు తెలిపారు.

# రజకులను ఆర్థికంగా ఆదుకునేది చంద్రబాబు నాయుడు ప్రభుత్వమే



- రజక వృత్తి చేసుకునేటువంటి ప్రతి ఒక్కరికి బ్యాంకు రుణాలు ఇప్పిస్తాం
- ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు

**విజయవాడ సెంట్రల్, జూలై 28 (మనం న్యూస్):** సోమవారం సాయంత్రం 27వ డివిజన్ పరిధిలోని సాంబమూర్తి రోడ్డు దుర్గాపురం లో ఉన్న రజక కళ్యాణ మండపంలో రజక చైతన్య సంస్థ మహాసభ జరిగింది. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే , టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు బొండా ఉమామహేశ్వరరావు హాజరయ్యారు. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు రాష్ట్ర అధ్యక్షులు కాకినాడ రామారావు అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రజకులు మొదటి నుండి తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా ఓటు వేసేటువంటి చైతన్య పూరితమైన కులస్తులు అని, 2014లో తాను ఎమ్మెల్యేగా గెలుపొందడానికి నేడు మరోకమారు ఎమ్మెల్యేగా గెలుపొందడానికి రజకులు విశేషంగా కృషి చేశారని వారిని అభినందించారు. ఈ రజక చైతన్య సంస్థ తనకు చేదోడు, వాదోడుగా ఉంటూ ప్రజానీకానికి తాను ఎమ్మెల్యేగా చేస్తున్నటువంటి మంచి పనులు అన్ని ప్రజలకు చేరువ చేసే విధంగా పనిచేస్తున్నారని అన్నారు. సెంట్రల్ నియోజకవర్గంలోని 21 డివిజన్లో పెద్ద ఎత్తున బీసీలు ఉంటే, బీసీలలో మొదటి స్థానం రజకులు ఉన్నటువంటి అంశాన్ని ఈ సందర్భంగా తెలియజేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఏడు 7 శాతం జనాభా కలిగిన రజకులు వారు అడిగే న్యాయమైన కోరికలను చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకొని వెళ్లి సమస్యలను పరిష్కారం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. అనేక ఏళ్ల నుండి రజకులు అందరినీ ఎస్సి జాబితాలో చేర్చాలి అని కోరిక సమ్మతమేనని అన్నారు. కొన్ని న్యాయపరమైనటువంటి చిక్కులు ఉన్నందున రేపు జరగబోయేటువంటి అసెంబ్లీ సమావేశాలలో దీనిపై మాట్లాడి సమస్యను అసెంబ్లీ దృష్టికి తీసుకొని వస్తానని తెలిపారు.

# సీపిఎం ఆధ్వర్యంలో నిరసన, ధర్నా




**విజయవాడ సెంట్రల్, జూలై 28 (మనం న్యూస్)** లు లు ఇంటర్నేషనల్ మాల్ సంస్థకు విజయవాడ పాత బస్టాండ్ లోని 4.17 ఎకరాల స్థలాన్ని కట్టబెడుతూ ప్రభుత్వం ఇచ్చిన జీవో 137 రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం నాడు పాత బస్టాండ్ వద్ద నిరసన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు జీవో కాపీలను దగ్ధం చేసే యత్నం చేశారు. అయితే పోలీసులు అడ్డుకోవడంతో స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. ధర్నాలో పాల్గొన్న సిహెచ్ బాబురావు డి. కాశీనాథ్ తదితరులు ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. విజయవాడ నగరంలోని పాత బస్టాండ్ స్థలాన్ని 99 ఏళ్ళకు లులూ ఇంటర్నేషనల్ సంస్థకు లీజుకు ఇస్తూ జి.ఓ నెంబర్ 137 కూటమి ప్రభుత్వం విడుదల చేయడం శోచనీయమన్నారు. నగరం నడిబొడ్డున 4.17 ఎకరాల్లో కోట్ల రూపాయలు విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని బడా బహుళ జాతి సంస్థకు ఇవ్వడం దుర్మార్గమన్నారు. నగరంలో ఉన్న చిన్న, మధ్యతరగతి వ్యాపారుల పొట్ట కొట్టి, వ్యాపారాలను పూర్తిగా దెబ్బతీసే ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించాలని ప్రజాస్వామ్య వాదులకు పిలుపునిచ్చారు.



# వైయస్ జగన్‌ని కలిసిన వెలంపల్లి దేవినేని మల్లాది

విజయవాడ సెంట్రల్, జులై 28 (మనం న్యూస్ ): రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైయస్ జగన్ మోహన్ రెడ్డి ని సోమవారం నాడు తాడేపల్లి లోని వారి నివాసం నందు మాజీ మంత్రి, విజయవాడ పశ్చిమ వైసిపి ఇంచార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు, జిల్లా పార్టీ అధ్యక్షులు దేవినేని అవినాష్, సెంట్రల్ ఇంచార్జ్ మల్లాది విష్ణు మర్యాదపూర్వకంగా కలిసారు

# ఆర్జీల పరిష్కారంలో నిర్దిష్టమైన స్పష్టత ఉండాలి



**విజయవాడ సెంట్రల్, జూలై 28 (మనం న్యూస్):** ప్రజా సమస్యల పరిష్కర వేదిక కార్యక్రమం ద్వారా అందే ఆర్జీలను పారదర్శకంగా, జవాబు దారితనంతో నిర్దిష్టమైన స్పష్టతతో అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్)) కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆర్జీదారుల నుండి స్వీకరించిన సమస్యలకు సంబంధించి అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంలో ఎటువంటి అలసత్వం ప్రదర్శించిన ఉపేక్షించబోనని కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. ప్రతి ఆర్జీని అధికారులు వ్యక్తిగత సమస్యగా భావించి పరిష్కార మార్గం చూపాలన్నారు. పిజిఆర్ఎస్లో నమోదు అయ్యే ఆర్జీల పరిష్కారం పై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని, ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో అధికారులు సమస్యలను పరిశీలించి నిర్ణీత కాల పరిమితిలోగా పరిష్కరించాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు.

# కృత్రిమ ఎరువుల కొరత సృష్టిస్తే ఖబడ్దార్..

మొదటి పేజీ తరువాయి...

**విజయవాడ సెంట్రల్, జూలై 28 (మనం న్యూస్:** జిల్లాలో ఖరీఫ్ వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నవేళ సమృద్ధిగా ఎరువులు, పురుగు మందులు ఉన్నాయని.. ప్రస్తుతం 9,976 మెట్రిక్ టన్నుల యూరియా, 2,457 మెట్రిక్ టన్నుల డీఏపీ, 1,157 మెట్రిక్ టన్నుల ఎంవోపీ, 14,197 మెట్రిక్ టన్నుల ఎన్పీకే ఇలా మొత్తం దాదాపు 30,332 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. ఎరువులు, పురుగుమందులకు సంబంధించి కృత్రిమ కొరత సృష్టించి, అన్నదాతలను గందరగోళానికి గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని, దుకాణాల లైసెన్సులు రద్దుచేస్తామని హెచ్చరించారు. సోమవారం కలెక్టర్ లక్ష్మీశ కంచికచర్లలో శ్రీ కనకదుర్గ ఎరువులు, పురుగుమందుల దుకాణం, గోదాముతో పాటు మన గ్రోమోర్ ఎరువులు, పురుగుమందుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదులూ రాలేదని, ఒకవేళ రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే సహించేది లేదని కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు. ఎరువులు, పురుగు మందులపై ఫిర్యాదులు లేదా సమాచారం అందించేందుకు కలెక్టరేట్లో 91549 70454 నంబరుతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తెలిపారు.రసాయన ఎరువుల విచ్చలవిడి వినియోగంతో కలిగే దుష్పరిణామాలపై రైతులకు అవగాహన కల్పించి ప్రకృతి సాగు విధానాలు దిశగా వారిని మళ్లిస్తున్నామని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్ (జెడ్బీఎన్ఎఫ్) వల్ల సాగు ఖర్చులు తగ్గడంతో పాటు అధిక రాబడులు, ఆదాయాలు వస్తాయన్నారు. ఇష్టమొచ్చినట్లు రసాయన ఎరువులు ఉపయోగిస్తే భూ సారం క్షీణిస్తుందని, పర్యావరణానికీ ముప్పు ఏర్పడుతుందని ఈ నేపథ్యంలో రసాయన ఎరువుల వినియోగాన్ని 15-20 శాతం వరకు తగ్గించేందుకు, పీఎం ప్రణమ్ పథక లక్ష్యాలను చేరుకునేందుకు సమష్టిగా కృషిచేయాల్సిన అవసరముందన్నారు. కలెక్టర్ వెంట నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణ, అగ్రి ఏడీ శ్రీనివాస్, ఏవో విజయ్ కుమార్, తహసీల్దార్ నరసింహారావు తదితరులు ఉన్నారు.